క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంఎస్ నగర్‌లో బోడ సరస్వతి అనే వివాహిత గుండెపోటుతో మృతి చెండడంతో వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం మంజూరైంది. ఈ మేరకు సోమవారం వార్డు కౌన్సిలర్ చెన్నమ్మ, ఇన్‌చార్జ్ కొరిశెట్టి విశ్వనాథ్, సచివాలయ కన్వీనర్ డీలర్ మధు బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేలు నగదు అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వారు తెలిపారు.

వరిగడ్డికి డిమాండ్


ఎడ్లబండిలో వరిగడ్డిని తరలిస్తున్న రైతు

మద్దికెర: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పశువులకు గడ్డి కొరత ఏర్పడింది. దీంతో రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి వరిగడ్డి కొనుక్కొని తెచ్చుకుంటున్నారు. వరిగడ్డి ఒక బండి ధర రూ.6 వేలు, ట్రాక్టర్ రూ.10 వేల నుంచి రూ.12 వేల దాకా పలుకుతోంది. కర్ణాటక, అనంతపురం జిల్లాల నుంచి వరిగడ్డిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నామని రైతులు తెలిపారు. వేరుశనగ పంట ఆశించిన మేర లేకపోవడంతో జీవాలకు గ్రాసం లేకుండా పోయిందన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి భరోసా ఇచ్చారు. కృష్ణగిరికి చెందిన పార్టీ కార్యకర్త గోమసాని వెంకటేశ్వర్లు (62) అనారోగ్యంతో సోమవారం మృతి చెందడంతో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో నాయకులు జయరామిరెడ్డి, హుసేన్‌సాహెబ్, చిన్నన్న, సుంకన్న తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకునేందుకు కృషి

తుగ్గలి: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకునే విధంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు బోగోలు నాగభూషణరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ తీవ్ర వర్షాభావంతో ఈ ఏడాది పంట దిగుబడులు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో తుగ్గలి లేకపోవడం బాధాకరమన్నారు. అయితే ఎమ్మెల్యే శ్రీదేవి తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లిందన్నారు. త్వరలోనే కరువు మండలం ప్రకటన వస్తుందని రైతులెవరూ ఆందోళన చెందవద్దని ఆయన కోరారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ, అధికారులు

మద్దికెర: వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారని, మండలంలో కోట్లాది రూపాయలతో పనులు జరుగుతున్నా టీడీపీ వారికి మాత్రం కనిపించవని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ సుహాసిని అన్నారు. సోమవారం మద్దికెర సచివాలయం-1 పరిధిలోని ప్రధాన బజారు నుంచి చాకలి వీధికి వెళ్లే దారిలో రూ.4.65 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని 4 సచివాలయాల పరిధిలో రూ.80 లక్షల నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విష్ణు, ఉప సర్పంచ్ ప్రమీల, వార్డు సభ్యులు బాలచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణ, నాయకులు వెంకట్రామిరెడ్డి, రామాంజులు, ప్రసాద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి చిత్రపటం ఊరేగింపు


మణికంఠ అయ్యప్పస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

దేవనకొండ: స్థానిక అయ్యప్పస్వామి ఆలయం నుంచి స్వామివారి చిత్రపటాన్ని ట్రాలీ ఆటో వాహనంపై ఉంచి మండలంలోని ప్రధాన వీధులగుండా ఊరేగించారు. రథం ముందు చిన్నారులు కలశాలతో సందడి చేశారు. ఇరుముడి కట్టిన అయ్యప్పస్వామి భక్తులు, శివమాల వేసిన శివ భక్తులు, గ్రామపెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా

- పత్తికొండ నియోజకవర్గంలో 3,221 సంఘాల్లోని 32,645 మందికి లబ్ధి
- ఇప్పటికే మూడు విడతల్లో రూ.53.88 కోట్ల రుణమాఫీ సొమ్ము చెల్లింపు
- వచ్చే జనవరిలో ఆఖరి విడత మాఫీ సొమ్ము జమ
- పొదుపు మహిళల హర్షం


పొదుపు మహిళలు (ఫైల్)

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు బాసటగా నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థిక స్వావలంభనే ధ్యేయంగా డ్వాక్రా సంఘాలను బలోపేతం చేశారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలు స్వశక్తితో ఎదిగేలా ఆర్థిక భరోసా కల్పించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇప్పటికే మూడు విడతల్లో రూ.53.88 కోట్లు రుణమాఫీ సొమ్ము వారి ఖాతాలకు జమ చేశారు. కరోనా మహమ్మారి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ సీఎం వైఎస్ జగన్ డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకున్నారు. 2019 ఎన్నికల నాటికి పొదుపు మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణం రూ.71.88 కోట్లుగా ఉంది. నాలుగు విడతల్లో రుణం మాఫీ చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటివరకు మూడు విడతల్లో ఆయా సంఘాలకు మాఫీ సొమ్ము చెల్లించారు. పత్తికొండ నియోజకవర్గంలో 3,211 మంది పొదుపు మహిళలకు ఇప్పటివరకు రూ.53.88 కోట్ల లబ్ధి చేకూరింది. ప్రభుత్వం మూడు విడతలుగా చెల్లించిన ఈ సొమ్ముతో సంఘాలు ఆర్థికంగా బలపడ్డాయి. వచ్చే జనవరిలో చివరి విడత మాఫీ సొమ్ము జమ చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. సంఘాలు అభివృద్ధిలోకి రావడంతో పొదుపు మహిళలు పాలేట్లు, అంగళ్లు, దుస్తుల వ్యాపారంతో పాటు, గేదెలు, ఆవులు లాంటి పశుపోషణ సైతం నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చింది. మహిళలకు ఆర్థిక భద్రత ఏర్పడింది. కుటుంబ పోషణలో మరింత బాధ్యత తీసుకున్నారు. తమ పిల్లలను ఉన్నత విద్యావంతులను చేస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో సామాజిక అభివృద్ధి కనిపిస్తోంది. రుణమాఫీతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా డ్వాక్రా సంఘాలు మూడు విడతల్లో పొందిన లబ్ధి వివరాలు

మండలం	సంఘాలు	లబ్ధిదారులు	రుణమాఫీ (రూ.కోట్లలో)
వెల్దుర్తి	849	8,580	14.86
పత్తికొండ	719	6,984	11.15
తుగ్గలి	673	6,914	11.46
మద్దికెర	554	6,076	10.78
కృష్ణగిరి	416	4,091	5.63

మూడు విడతల్లో మాఫీ సొమ్ము జమ

పొదుపు సంఘాలకు రుణ మాఫీ సొమ్మును ప్రభుత్వం ఇప్పటికే మూడు విడతల్లో సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. చివరి విడత మాఫీ సొమ్ము వచ్చే జనవరిలో జమ అవుతుంది. రుణమాఫీకి అర్హులైన సంఘాల సభ్యుల చేత బయోమెట్రిక్ నమోదు చేస్తున్నాం. అర్హులందరికీ రుణ మాఫీ నాలుగో విడత సొమ్ము అందేలా చర్యలు చేపట్టాం.

– రాధాకృష్ణ, వైకేపీ ఏపీఎం, తుగ్గలి

రూ.5 లక్షలకు పైగా రుణమాఫీ



ఎన్నికల ముందు వైఎస్ జగనన్న ఇచ్చిన హామీ మేరకు మా విజయలక్ష్మి సంఘానికి రూ.5.6 లక్షలు రుణం మాఫీ అయ్యింది. మూడు విడతల్లో మాఫీ సొమ్ము నేరుగా మా ఖాతాలకు జమ చేశారు. వచ్చిన సొమ్ము వ్యవసాయ ఖర్చులకు వినియోగించుకుంటున్నాం. రుణమాఫీ, సున్నా వడ్డీ, చేయూత వంటి పథకాలతో మహిళలను లక్షాధికారులను చేశారు. మళ్లీ జగననే సీఎం కావాలి.

– ప్రభావతి, డ్వాక్రా సభ్యురాలు, బొల్లవానిపల్లి

మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రుణామాఫీ చేస్తానని చెప్పి మహిళలను మోసం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పొదుపు మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం రుణ మాఫీ చేసి మాట నిలబెట్టుకున్నారు. నాకు మూడు విడతల్లో రూ.29 వేలు మాఫీ సొమ్ము అందింది. సున్నా వడ్డీ సక్రమంగా వస్తోంది. రుణమాఫీ చేసిన జగనన్నకు అండగా ఉంటాం.


– లక్ష్మీబాయి, డ్వాక్రా సభ్యురాలు, ఎల్లమ్మగుట్ట తండా

జోరుగా కంది నూర్పిళ్లు


సంచర్లలో కంది పంటకోత చేపట్టిన యంత్రం

చిప్పగిరి: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన కంది పంటలకు సంబంధించి నూర్పిళ్లు జోరందుకున్నాయి. ఆయాగ్రామాల్లో రైతులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఆధునిక యంత్రాల ద్వారా పంట కోతలు చేపడుతున్నారు. కంది పంటకోత చేపట్టేందుకు ఎకరానికి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. కంది ధర ఆశించిన స్థాయిలో ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కంటే ప్రస్తుతం దిగుబడులు పెరిగినట్లు పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

28న గూళ్యంలో పూల రథోత్సవం


స్వామివారి పూల రథం (ఫైల్)

హాలహర్వి: మండలంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం గూళ్యం గాదిలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 28వ తేదీన గాదిలింగప్ప తాత 20వ పూల రథోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు, గ్రామపెద్దలు సోమవారం విలేకరులకు తెలిపారు. పూల రథోత్సవం వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అలాగే తాత వారి రథాన్ని సుందరంగా అలంకరించారు. వేడుకలకు తరలివచ్చే భక్తులకు ఆలయంలో అన్నదానం, మంచినీరు, వసతి తదితర సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


చర్చిలో ఎర్రకోట జగన్‌ను సన్మానిస్తున్న దృశ్యం


వెల్దుర్తిలో ప్రార్థనా గీతాల ఆలాపన


మద్దికెరలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సాక్షి నెట్‌వర్క్: ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకలను పట్టణంలో సోమవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. విద్యుత్ దీపాల అలంకరణలు చేసిన పలు చర్చిల్లో ఉదయం నుండే పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయా చర్చిల్లో పాస్టర్లు క్రీస్తు సందేశం వివరించారు. స్థానిక చర్చిలో రెవరెండ్ పాస్టర్ జయన్న క్రీస్తు జన్మ వృత్తాంతంతో పాటు ఏసు బోధనలను వినిపించారు. ఎంబీ చర్చితో పాటు సెయింట్‌పాల్ సీఎస్‌ఐ చర్చి, సీఎస్‌ఐ 1, 2 తదితర ప్రార్థనా మందిరాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి పాస్టర్లు జయన్న, జీవన్‌కుమార్, కార్యదర్శి భాస్కర్‌బాబు, నాయకులు బుట్టారంగయ్య, సునీల్‌కుమార్, నజీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

➡ ప్రభువు ఏసు చూపిన శాంతి, ప్రేమ, సహన మార్గంలో నడుస్తూ ఉత్తమ జీవితం గడుపుదామని వెల్దుర్తి ఏబీఎం మెయిన్ చర్చి ఫాదర్ రెవరెండ్ సీ ఏసేపు ప్రబోధించారు. క్రిస్మస్ సందర్భంగా సోమవారం మండలంలోని 63 చర్చిలలో విశేష ప్రార్థనలు, కీర్తనలు సాగాయి. పలు చర్చిలలో పేదలకు వస్త్రదానం చేశారు. స్థానిక రైల్వే కాలనీలోని క్రిస్టియన్ అసెంబ్లీ చర్చిలో సామేలు కుమారులు ప్రభాకర్ సోదరులు, రెండో ఏబీఎం చర్చిలో రెవరెండ్ లాజర్, హోసన్న చర్చిలో రెవరెండ్ ఇసాక్, మన్న ప్రేయర్ చర్చిలో రెవరెండ్ గాబ్రియల్, డివైన్ బాప్టిస్టు చర్చిలో మనోహర్‌బాబు, పాస్టర్ దావీదు, బెరక క్రిస్టియన్ అసెంబ్లీలో పాస్టర్ ఏసేపు, పట్టణ, గ్రామాల్లోని అన్ని చర్చిలలో పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు. ఏబీఎం మెయిన్ చర్చిలో నిర్వహించిన బైబిల్ క్విజ్, ఆటపాటల పోటీల విజేతలకు ఏఎస్‌ఐ ఆర్.లక్ష్మన్న అందించిన బహుమతులను చర్చి సంఘం ప్రతినిధులు జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, తిమోతి, పౌలు, నాగరాజు, మాధవస్వామి చేతుల మీదుగా అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


ఆలూరులో సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు


జొన్నగిరి చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


పత్తికొండ బేతస్థ ప్రార్థనా మందిరంలో ఏసు జన్మ వృత్తాంతాన్ని వివరిస్తున్న శ్యాంరాజ్ నాయక్


హాలహర్విలో దైవ సందేశం వినిపిస్తున్న పాస్టర్

కార్యకర్తలకు అండగా ఉంటా

ఆలూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం భరోసా ఇచ్చారు. స్థానిక మంత్రి నివాసంలో సోమవారం రాత్రి చిప్పగిరి మండలం ఏరూరు గ్రామానికి చెందిన జయరాం ఆయన్ను కలిసి తన ఇంటి నిర్మాణం కోసం సహకారం అందించాల్సిందిగా విన్నవించారు. స్పందించిన మంత్రి రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న సారథ్యంలో ప్రతి ఒక్కరికీ మేలు చేసేలా కృషి చేస్తున్నామన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.


ఏరూరు జయరాంకు రూ.50 వేలు సాయం అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

నేటి నుంచి క్రీడాపోటీలు


పెద్దనేలటూర్ జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఏర్పాట్లు

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యం గుర్తించేందుకు ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి సచివాలయ స్థాయిలో 'ఆడుదాం- ఆంధ్ర' క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. గ్రామ సచివాలయ స్థాయిలో 5 రకాల క్రీడలు క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తారు. ఇందుకోసం మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో క్రీడామైదానాలను అధికారులు సిద్ధం చేశారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ఈనెల 26 నుంచి జనవరి 9వ తేదీ వరకు, మండల స్థాయిలో 10 నుంచి జనవరి 23వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల నుంచి 4,438 మంది క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్లను (స్పోర్ట్స్) పంపిణీ చేసినట్లు తెలిపారు.

కృష్ణగిరి: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలకు విజయవంతం అయ్యేలా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ రామస్వామి సూచించారు. సోమవారం ఆయన కృష్ణగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నుంచి జరిగే క్రీడా పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. మండల వ్యాప్తంగా క్రీడాకారుల నమోదు వందశాతం పూర్తి అయ్యిందన్నారు. మండలంలో 3,207 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని చెప్పారు.

నందవరం: గ్రామస్థాయిలో మంగళవారం నుంచి 'ఆడుదాం- ఆంధ్ర' క్రీడ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. మండలంలోని ఆయా గ్రామ సచివాలయ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి క్రీడ పోటీలు ప్రారంభమవుతామని వివరించారు. క్రికెట్ క్రీడ అంశానికి సంబంధించి మండలంలో 5 మైదానాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వాజ్‌పేయికి నివాళి

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో సోమవారం మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి కార్యక్రమాన్ని బీజేపీ మండల కన్వీనర్ నరసప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. బీజేపీ నాయకులు రామాంజినేయులు, నారాయణ, కరుణాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీకి నీరు బంద్


హొళగుంద సెక్షన్‌లోని దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో తగ్గిన నీరు

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు విడుదల అవుతున్న నీటిని సోమవారం టీబీ బోర్డు అధికారులు నిలిపివేశారు. గంటకు వంద క్యూసెక్కులు చొప్పున తగ్గిస్తూ సాయంత్రానికి పూర్తిగ నిలిపివేశారు. జిల్లాకు సంబంధించి ఎల్లెల్సీ పరిధిలో ఆంధ్ర కాలువ ప్రారంభం (హన్వాళ్ సెక్షన్) 250 కి.మీ వద్ద ఇంకా ప్రవాహం కొనసాగుతోంది. గత నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలతో తుంగభద్ర జలాశయంలో పూర్తిస్థాయిలో నీరు చేరుతుండడంతో దిగువ కాలువ (ఎల్లెల్సీ) కింద రైతులు రెండు కార్ల పంటలు పండించారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఎల్లెల్సీ కింద ఒక కారు పంటకు (ఖరీఫ్) మాత్రమే నీరు సరిపోయాయి. ప్రస్తుతం టీబీ డ్యాంలో 10.5 టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో వాటిని వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోనున్నారు. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో జీరో ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 80 టీఎంసీల నీటి నిల్వ ఉండేది.

ఘనంగా గ్యారతారిఖ్ వేడుకలు


స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో సోమవారం గ్యారతారిఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్


రిబ్బన్ కట్ చేసి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ భూపాలుడు

దేవనకొండ: క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని తెర్నెకల్ గ్రామంలో క్రిస్మస్ పండగను పురస్కరించుకొని ఏబీఎం చర్చి పెద్దల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ భూపాలుడు ప్రారంభించారు. కాసేపు క్రీడాకారులతో కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువకులు క్రీడల్లో నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ అరుణ్‌కుమార్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. నాయకులు ఈరన్న, రాఘవేంద్ర, పులినరేష్, ఏబీఎం చర్చి సంఘ పెద్దలు యేసన్న, ఫిలిప్స్, తదితరులు పాల్గొన్నారు.

కురువల ఐక్యవేదిక విజయవంతంపై హర్షం


నినాదాలు చేస్తున్న కురువ నాయకులు

ఆలూరు: కురువ కులస్తుల హక్కుల సాధన ఐక్య వేదికకు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వారి రుణం తీర్చుకోలేనిదని సభ నిర్వాహకులు బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, కృష్ణమోహన్, ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయరాం తదితరులు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం వారు మాట్లాడుతూ.. కురువల మహాసభ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. సభ నిర్వహణలో సహకారం అందించిన రెవెన్యూ, పోలీసు ఇతర శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కురువ కులస్తుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కురువ నాయకులు దేవేంద్ర, శ్రీధర్, రంగయ్య, రాజ్, రామ్మోహన్ ఉన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. సోమవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక ఏబీఎం చర్చి సంఘస్తులు చేట్ల వందనాలు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మొత్తం 15 జతల ఎద్లు పాల్గొన్నాయి. కోడుమూరు మండలం, వెంకటగిరి గ్రామానికి చెందిన బీఎల్‌కే ఎద్లు నిర్ణీత సమయానికి 4996 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.35 వేలు కైవసం చేసుకున్నాయి. అలాగే కర్నూలు మండలం, పంచలింగాలకు చెందిన బైరుపోగు సంకన్న వృషభాలు 4800 అడుగులు లాగి రెండో బహుమతి రూ.30వేలు దక్కించుకున్నాయి. కర్నూలు మండలం, పి.రుద్రవరం గ్రామానికి చెందిన రాముడు, ఎల్లగౌడు వృషభాలు 4671 అడుగులు లాగి మూడో బహుమతి రూ.20 వేలు సాధించగా, నాగర్‌కర్నూలు జిల్లా, కొల్లాపురానికి చెందిన మాస్టర్ సాత్విక్ ఎద్దులు 4449 అడుగులు లాగి నాల్గో బహుమతి రూ.10 వేలను గెలుచుకున్నాయి. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, రామనాయుడు, శంకర్ రెడ్డి గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న ఓ.టి.మూకన్న (65) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. ఈయన గతేడాది నుంచి చికిత్స పొందుతున్నారని, కోలుకోలేక మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి.. రూ.15 వేలను డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ జయరామిరెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. వీఆర్వో రమేష్, వీఆర్‌ఏల సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, మండలాధ్యక్షుడు వెంకటేశులు, కార్యదర్శులు సిద్ధప్ప, నాగరాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో సోమవారం ఇంటి వద్ద నాటుసారా విక్రయిస్తున్న రామాంజనేయులును అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్‌ఐ ఎర్రిస్వామి తెలిపారు. ఆయన నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. ఎవరైనా నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు